
ప్రజాశక్తి
మంగళవారం 18 జూన్ 2024
5
విజయనగరం




జిఒ 117ను రద్దు చేయాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిఒ 117ను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని యుటిఎఫ్ నాయకులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని కోరారు. సోమవారం లక్కవరపుకోటలోని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నివాసంలో మంత్రిని యుటిఎఫ్ నాయకులు కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు జి.వి రమణ, జి.వెంకటరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల పాఠశాలలు నిర్వీర్యం అయిపోయాయని అన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతం కావాలంటే అమ్మఒడి పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే అమలు చేయాలన్నారు. ఎంటిఎస్ 1998-2008 మధ్య గల బ్యాచ్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమాత్యునికి అగ్ని పరీక్ష



- పదవి, పార్టీని సమతూకం చేసుకుంటేనే భవిష్యత్తు
- అదృశ్య శక్తులపై అప్రమత్తంగా లేకపోతే తప్పతోవే
- శాఖలపై పట్టు బిగించకపోతే మాట వినే పరిస్థితి ఉండదు
- ఆచితూచి అడుగులేయాల్సిన సమయమిది
- నాన్చుడి ధోరణితో వ్యవహరించినా పాలనకు ఆటంకమే
- అన్నింటినీ అధిగమిస్తే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను...! మన జిల్లాకు చెందిన అమాత్యులవారికి అగ్నిపరీక్షే. ఈ పరీక్షలో నెగ్గాలంటే చాలా అప్రమతతోనూ, సమయ స్ఫూర్తితోను, చాకచక్యంగాను వ్యవహరించాల్సి అవసరం ఉంది. ముఖ్యంగా పార్టీలో ఎలాంటి బాధ్యతలూ లేనప్పటికీ, అదే పార్టీపెద్దలతో సమన్వయంగా వ్యవహరించాల్సి ఉంటుంది. లేదంటే పార్టీలో ఏం జరుగుతుందో తెలియక, ఎత్తుకు పైఎత్తులు అర్థం కాక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇవన్నీ బ్యాలెన్స్ చేసుకోవాలంటే ప్రాతినిధ్యం వహిస్తున్న శాఖతోపాటు జిల్లాలోని అన్ని శాఖలపైనా పట్టుసాధించాలి. లేదంటే అటు అధికారులు, ఇటు రాసుకుపూసుకు తిరిగే నాయకులు కూడా తప్పుతోవ పట్టించబోరన్న గ్యారెంటీ లేదు. ఆ తరువాత లేనిపోని అపవాదులు అంటగట్టే పరిస్థితులు రాబోవని చెప్పలేం. అలాగని ఆచుతూచి వ్యవహరించాలే తప్ప, నిర్ణయాత్మక సమయాల్లో నాన్చుడి ధోరణి కూడా ఏమంత మంచిది కాదు. టిడిపి రాజకీయ చరిత్రలో జిల్లాలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలను గుర్తుచేస్తూ చాలా మంది చేస్తున్న విశ్లేషణ ఇది. చాకచక్యంగా దూసుకెళ్లే అమాత్యులు ఎదురులేని నేతగా ఎదుగుతారనడంలో సందేహం లేదు.

గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్‌కు అనూహ్యంగా మంత్రి పదవి వరించిన సంగతి తెలిసిందే. ఆయన్ను వరించిన సూక్ష్మ, మధ్య, చిన్నతరహా మంత్రిత్వశాఖ తన శక్తిసామర్థ్యాల కొలమానికి ఎంతో దోహదపడుతుంది. ఈ శాఖ మంత్రిగా రాష్ట్రంలోనూ, ముఖ్యంగా చరిత్ర సృష్టించవచ్చు. పొట్టకూటి కోసం వలసలు, ఉపాధి హామీ పనులకు పోతున్న యువతకు అవకాశాలు కల్పించే బృహత్తర అవకాశమిది. ఇలా ఈ శాఖ మంత్రిగానే కొనసాగితే సరిపోదు. ఐదేళ్లపాటు జిల్లా అభివృద్ధిలో మంత్రి తన మార్క్ వేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకు ఎంతో దూర దృష్టితో ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలి. ఇలా సాగాలంటే అన్ని శాఖలపైనా పట్టు సాధించాలి. అలాంటప్పుడే అధికారులుగానీ, నాయకులు, ప్రజాప్రతినిధులుగానీ మాటలు వినే పరిస్థితి ఉంటుంది. లేదంటే పరిపాలన గాడితప్పే ప్రమాదం లేకపోలేదు.

ఇవన్నీ చేయాలంటే మంత్రి పాలనపై ఎక్కువ సమయం వెచ్చించాల్సి వుంటుంది. లేదంటే సలహాదారులు వందల కొద్దీ చేరిపోతారనడంలో సందేహం లేదు. ఇలాంటి సలహాదారుల వల్ల, పదుల సంఖ్యలో చేర్చుకున్న పిఎల వల్ల ఐదేళ్ల గడవకముందే పదవులు కోల్పోయినవారు, ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో టిక్కెట్లు రానివారు కూడా ఉన్నారు. గతంలో గజపతినగరం నుంచి మంత్రి అయిన పడాల అరుణకు పార్టీతో తగిన సమన్వయం లేకపోవడం, రాష్ట్ర నాయకత్వంతో సంబంధాలు తగినంతగా లేకపోవడం వల్ల ఏకంగా రాజకీయ జీవితాన్ని కోల్పోవాల్సిన పరిస్థితి దాపురించింది. గతంలో మన జిల్లా నుంచి కోళ్ల అప్పలనాయుడు 1967లోనే స్వతంత్ర అభ్యర్థిగా గెలిచారు. ఆ తరువాత టిడిపిలో చేరారు. మొత్తంగా ఏడు సార్లు గెలవగా 1985, 1989 ఎన్నికల్లో రెండు సార్లు మంత్రిగా పనిచేశారు. టిడిపి ఆవిర్భావం నుంచి ఉన్న పతివాడ నారాయణస్వామినాయుడు కూడా ఏడుసార్లు గెలిచినప్పటికీ ఒక్కసారే మంత్రిగా అవకాశం లభించింది. గజపతినగరం నుంచి పడాల అరుణ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిస్తే, మూడోసారి మంత్రివర్గంలో చోటు లభించింది. కానీ, శ్రీనివాస్ పార్టీలో చేరిన అనతికాలంలోనే నేరుగా ఏకంగా మంత్రి అయిపోయారు. యువకుడు కావడం, అనతికాలంలోనే మంత్రిగా పార్టీ అవకాశం కల్పించడంతో జిల్లా వాసుల్లో శ్రీనివాస్ పాలనపై ఆశలు పెరిగాయి. పట్టు నిలుపుకుంటే జిల్లాలో తిరుగులేని నాయకుడిగా ఎదిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చాలా మంది నాయకులు విశ్లేషిస్తున్నారు. అందుకు తగ్గట్టే శ్రీనివాస్‌లో నాయకత్వ లక్షణాలు కూడా కనిపిస్తున్నాయి. ఏడాది క్రితం వరకు రాజకీయాల్లో క్రియాశీలకంగా లేకపోయినప్పటికీ సుదీర్ఘ రాజకీయ అనుభవం గల కొండపల్లి పైడితల్లి నాయుడి వారసుడిగా ఉన్నారు. దీనికితోడు ఉన్న చదువు, మృదువైన భాష శ్రీనివాస్ పాలనకు ఎంతో దోహదపడతాయని చాలా మంది చర్చిస్తున్నారు. కానీ, పరిపాలనంతా నాయకులకు వదిలేస్తే ప్రజలతో సంబంధాలు ఉండవు. అదే జరిగితే అధికార దుర్వినియోగం జరిగే అవకాశం లేకపోలేదు. అందుకు భిన్నంగా శ్రీనివాస్ పరిపాలన ఉంటుందని ఆశిద్దాం.



కాజ్‌వే మీదుగా ప్రవహిస్తున్న వేగావతి నది

కొట్టుకుపోయిన కాజ్‌వే

నాసిరకం నిర్మాణంతో రూ.94 లక్షలు వృథా

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

మండలంలోని పారాది వద్ద వేగావతి నదిపై నిర్మించిన కాజ్‌వే కొట్టుకుపోయింది. పారాది వంతెన కుంగడంతో రూ.94 లక్షలతో నిర్మించిన కాజ్ వే నిర్మించారు. వరద నీరు పోయేందుకు ఖానాలు ఏర్పాటు చేసినప్పటికి సిమెంట్ కాంక్రీటుతో నిర్మించలేదు. మెటల్‌తో నింపేసి, దానిపై బిటి రోడ్డు నిర్మించారు. సోమవారం వేగావతి నది వరదనీటి ఉధృతికి కాజ్‌వే కొట్టుకుపోయింది. సిమెంట్ కాంక్రీటుతో కాజ్‌వే నిర్మించకపోవడం వల్లే వరద ఉధృతికి కొట్టుకుపోయిందని విమర్శలు వస్తున్నాయి. కాజ్ వే కొట్టుకుపోవడంతో ద్విచక్ర వాహనాలు, కార్లను పాత వంతెన పైనుంచి రాకపోకలకు అనుమతించారు. భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నారు. భారీ వాహనాలను దారి మళ్లించడంతో రవాణా ఖర్చులు భారం కావడంతోపాటు సమయానికి గమ్యానికి చేరుకోలేకపోతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నూతన వంతెన నిర్మాణం చేపట్టి, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



కొట్టుకుపోయిన కాజ్ వే



కురుస్తున్న వర్షం



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

పలు చోట్ల వర్షం

రైతుల హర్షం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో సోమవారం వేకువ జామున పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 14 మిల్లీమీటర్ల వర్షం పడింది. తెల్లవారి 4గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో ప్రజలు భయాందోళన చెందారు. సుమారు రెండుగంటల పాటు వర్షం కురిసింది. వర్షంతో పాటు గాలి వీయడంతో పూత దశలో ఉన్న నువ్వుపంటకు నష్టం వాట్లిందని నువ్వు రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు ఖరీఫ్ విత్తనాలు వేసేందుకు వర్షం అనుకూలించిందని రైతులు అంటున్నారు. అత్యధికంగా రామభద్రపురం మండలంలో 39.6మి.మీ, అత్యల్పంగా గజపతినగరంలో 1.4మి.మీ, వర్షం కరిసింది.

రహదారికి అడ్డంగా పడిన భారీ వృక్షం

రేగిడి : మండలంలోని తాటిపాడు కూడలి వద్ద సోమవారం ఉదయం మర్రిచెట్టు కొమ్మకు ఎత్తైన లోడుతో వచ్చిన లారీ భారీ వృక్షానికి తగిలి పెద్ద కొమ్మ విరిగిపడింది. రోడ్డు మధ్యలో పెద్ద కొమ్మ పడిపోవడంతో పాలకొండ-రాజాం ప్రధాన రహదారి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విశాఖ, విజయనగరం, రాజాం, పాలకొండ నుంచి వచ్చిన ఆర్‌టిసి ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురయ్యారు. స్థానికులు పోలీస్, ఆర్‌అండ్‌బి అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చేలోపు స్థానిక షా మిల్లు యజమాని స్పందించి ట్రాక్టర్ సహాయంతో కొమ్మలను తొలగించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి ప్రయాణికులు ఉపశమనం పొందారు.

వర్షపాతం	
ఎస్.కోట	34.2
వంగర	29.4
జామి	23.4
నెల్లిమర్ల	21.8
తెర్లాం	21.4
లక్కవరపుకోట	21.0
పూసపాటిరేగ	20.6
రేగిడి	18.6
రాజాం	15.6
విజయనగరం	14.2
సంతకవిటి	12.8
గుర్ల	12.6
గరివిడి	11.6
భోగాపురం	10.2
కొత్తవలస	10.2
మెరకముడిదాం	9.4
మెంటాడ	8.2
బాడంగి	8.2
గంట్యాడ	6.8
చీపురుపల్లి	5.8
దత్తిరాజేరు	5.4
బొబ్బిలి	4.2
బొండపల్లి	4.2
డెంకాడ	3.8
వేపాడ	3.6

ప్రతీ రైతుకు విత్తనాలు అందిస్తాం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ • రాయితీపై విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-గజపతినగరం

ప్రతీ రైతుకు విత్తనాలు అందేలా చేస్తామని చిన్న తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీఇచ్చారు. రైతులకు రాయితీపై వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని గజపతినగరం మార్కెట్ యార్డులో ఆయన సోమవారం ప్రారంభించారు. 1121 రకం వరి విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ కౌలురైతులకు సైతం విత్తనాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా అవసరాలకు సరిపడా విత్తనాలు సమకూర్చాలని వ్యవసాయ శాఖకు సూచించారు. ఎరువులు కూడా పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. తాను మంత్రిగా పాల్గొన్న తొలి కార్యక్రమం రైతులకు మేలు చేసేది కావడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను తెలుసుకొని, వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు మాట్లాడుతూ జిల్లాలో పంటల పరిస్థితిని వివరించారు. గతేడాది సుమారు 40 వేల క్వింటాళ్ల విత్తనాలను రాయితీపై అందజేశామని తెలిపారు.

ఈ ఏడాది 46 వేల క్వింటాళ్లు అవసరమని గుర్తించామని, దీనిలో 32 వేల క్వింటాళ్లు రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీకి సిద్ధంగా ఉంచామని వెల్లడించారు. ఇప్పటికే సుమారు 7 వేల క్వింటాళ్ల పంపిణీ జరిగిందని తెలిపారు. వ్యవసాయ శాఖ గజపతినగరం ఎడి కె.మహారాజన్ మాట్లాడుతూ రైతులు వన్‌బి తీసుకువెళ్లి రాయితీపై విత్తనాలను పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ, విజయనగరం ఎడి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ఘనంగా బక్రీద్

ప్రజాశక్తి-విజయనగరం కోట

త్యాగానికి, ధర్మానికి ప్రతీక బక్రీద్ అని వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షులు ఎం.కరీమ్ అన్నారు. సోమవారం బక్రీద్ సందర్భంగా నగరంలోని అన్ని మసీదులలో ముస్లిములంతా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కరీం మాట్లాడుతూ ఇస్లాం మతం.. శాంతి చిహ్నం, మత సామరస్యం, సద్భావన కల్గి వుండడం, సోదర భావాన్ని పెంపొందించుకోవడం తెలుపుతుందన్నారు. దార్మిక త్యాగ నిరతికి నిదర్శనంగా ముస్లిములు జరుపుకునే అత్యంత పవిత్రమైన పర్వదినమని తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిములంతా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వైసిపికి రొంగలి పోతన్న రాజీనామా


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఆ పార్టీ నాయకుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగళి పోతన్న రాజీనామా చేశారు. సీనియర్ నాయకులుగా ఉన్న ఆయన 2016 నుంచి వైసిపిలో సేవలు అందించారు. వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావుకు పంపిన లేఖలో పేర్కొన్నారు.

చింతపల్లి సముద్రంలో కార్మికుడు గల్లంతు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చింతపల్లి సముద్రంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన అబ్దుల్ కలామ్ మాలిక్ (27) సోమవారం గల్లంతయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం... మాలిక్ పైడిభీమవరంలోని ఎలక్ట్రోమెక్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. బక్రీద్ సందర్భంగా పరిశ్రమకు సెలవు ఇవ్వడంతో మరో ఏడుగురు యువకులతో కలిసి మాలిక్ చింతపల్లి సముద్ర స్నానానికి వచ్చాడు. వీరంతా సముద్రంలో స్నానం చేస్తుండగా కలామ్ కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న మెరైన్, సివిల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సముద్రంలో గాలింపు చర్యలు ప్రారంభించామని ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు.



గల్లంతైన మాలిక్

బడి ఇలా..

చదువులు సాగేదెలా?

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ఈ చిత్రంలో కూర్చున్న చిన్నారులు, విద్యాబుద్ధులు నేర్పుతున్న మహిళను చూసి ఇదేదో మారుమూల గ్రామంలో 'ప్రయివేటు' అనుకుంటారేమో! అలా అనుకుంటే పొరపాటే. చదువుతున్న మహిళ.. ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. వారంతా ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు. ఇంతకీ ఏం జరిగిందంటారా.?

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ఈ నెల 13న పునఃప్రారంభ మయ్యాయి. చాలీచాలని ఇరుకు గదుల్లో పాఠాలు నేర్చుకొనేందుకు కొందరు విద్యార్థులు సిద్ధం కాగా, మరికొందరు ప్రయివేటు పాఠశాలలకు వెళ్లేందుకు చూస్తున్నారు. మండలంలో గత ప్రభుత్వం మనబడి నాడు - నేడు కార్యక్రమంలో నిధులు మంజూరు చేసినా చాలాచోట్ల అదనపు తరగతి గదులు పూర్తికాలేదు. భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. భోజరాజపురం పాఠశాల భవనం శిథిలావస్థకు చేరినా అందులోనే తరగతులు నిర్వహిస్తున్నారు. గిరిజన గ్రామం బట్టివలసలో పురిపాకలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. అలజంగి గ్రామంలో ఉన్నత పాఠశాలకు అదనపు తరగతి గదులు నాలుగు మంజూరైనా రెండు మాత్రమే స్లాబ్ వేసి వదిలేశారు. బొబ్బిలి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో అదనపు తరగతి గదులు అవసరమున్నా మంజూరు చేయలేదు. దీంతో ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు ఎక్కడ కూర్చోవాలో తెలియక ప్రయివేటు పాఠశాలల్లో చేరేందుకు సన్నద్ధం అవుతున్నారు. బట్టివలస, భోజరాజపురంలో పాఠశాల భవనాలకు ప్రతిపాదనలు పంపించామని ఎంఇఒ లక్ష్మణరావు తెలిపారు.



బట్టివలసలో పురిపాకలోనే పాఠాలు

విద్యార్థులకు బస్‌పాస్ పాట్లు

పనిచేయని ఆర్‌టిసి సర్వర్

ప్రజాశక్తి-వేపాడ

పాఠశాలలు పున:ప్రారంభమై ఐదు రోజులైంది. ఆర్‌టిసి సర్వర్ పనిచేయకపోవడంతో విద్యార్థులకు బస్‌పాసులు నేటికీ అందలేదు. దీంతో పాఠశాలలకు చేరుకునేందుకు విద్యార్థులు నానా పాట్లు పాడుతున్నారు. ఆటోలను, ప్రయివేటు వాహనాలను ఆశ్రయించి పాఠశాలలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఆ అవకాశం లేనివారు కాలినడకన పాఠశాలలకు వస్తున్నారు.

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాల, ఎస్.కోట, కొత్తవలస వంటి ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాలల ప్రారంభానికి ముందే బస్‌పాసులు ఇచ్చేవారు. శృంగవరపుకోట ఆర్‌టిసి డిపోలో విద్యార్థులకు బడి బస్సులో ప్రయాణం చేయడానికి పాసులు ఇచ్చేవారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడం, ఆర్‌టిసి సర్వర్ పనిచేయకపోవడంతో విద్యార్థులకు సకాలంలో పాసులు అందలేదు. చేసేదిలేక కొంతమంది ఆటోలపై పాఠశాలలకు వెళ్తున్నారు. కొంతమంది కాలినడకన రావాల్సి వస్తోంది. బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలకు వెళ్లేందుకు మండల కేంద్రం వేపాడ నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర నడవడం తప్పలేదు. బడి విడిచి పెట్టే సమయంలో వర్షం వస్తే విద్యార్థుల వారి ఇళ్లకు చేరేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బస్‌పాసులు అందేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌ని వివరణ కోరగా సర్వర్ సరిగా పనిచేయలేదని, సర్వర్ పనిచేస్తే బస్‌పాసులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని డిపో మేనేజర్ తెలిపారని వివరించారు.



కాలినడకన పాఠశాలకు వస్తున్న విద్యార్థినులు

నాలుగంచెల వ్యవస్థను రద్దు చేయాలి

మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు

ప్రజాశక్తి-చీపురుపల్లి

గ్రామ స్వరాజ్యం బాగు కోసం, ప్రజల అభ్యున్నతి బాగు కోసం మండల వ్యవస్థలో నడుస్తున్న నాలుగంచెల వ్యవస్థను రద్దు చేసి మూడంచెల వ్యవస్థను తీసుకురావాలని టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు అన్నారు. స్థానిక రామాంజనేయ థియేటర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనసేన ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కోట్ల కృష్ణతో కలసి ఆయన మాట్లాడారు. గ్రామాల అబివృద్ధి కోసం ఎన్‌టిఆర్ మండల వ్యవస్థని తీసుకువచ్చారని గుర్తు చేశారు. పంచాయతీలకు నేరుగా నిధులు రావాలన్నా, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నా ప్రస్తుతం ఉన్న వ్యవస్థను రద్దు చేసి మూడంచెల వ్యవస్థను తీసుకు రావాలన్నారు. 2029లో తిరిగి అధికారంలోకి రావాలంటే కక్ష సాదింపు, అహంకారం వంటివి ఉండ కూడదన్నారు. ఆడుదాం ఆంధ్రా పేరిట వంద కోట్ల రూపాయల మేర అవినీతి జరిగిందని గద్దే బాబూరావు ఆరోపించారు.



రైతుకు విత్తనాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకుడు రామ్ మల్లిక్ నాయుడు

రైతులకు సకాలంలో విత్తనాలు

ప్రజాశక్తి - గుర్ల

రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రాంమల్లిక్ నాయుడు అన్నారు. సోమవారం ఆయన గుర్ల రైతు భరోసా కేంద్రం వద్ద రాయితీ వరి విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కృత్రిమ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పొట్నూరు ప్రమీల, టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వెన్నె సన్యాసినాయుడు. కార్యనిర్వాహక కార్యదర్శి తిరుముల రాజు కిరణ్ కుమార్, వైస్ ఎంపిపి తోట తిరుపతి రావు, నియోజకవర్గం బిసి సెల్ నాయకులు దాసరి శివ ప్రసాద్, చీపురుపల్లి ఎడి కోటేశ్వరరావు, ఎఒ తిరుపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కళ్యాణం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో బానాది గ్రామంలో శివపార్వతుల కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు మేడపాటి కిశోర్ శర్మ ఆధ్వర్యాన పూజలు చేశారు. ఇందులో గ్రామ నాయకులు గొంప వెంకటరావు, ఎంపిటిసి గొంప తులసి దంపతులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

నేరాలు ఘోరాలు

మహిళ అనుమానాస్పద మృతి

వివాహమైన నాలుగు నెలలకే..

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని బంగారమ్మపేట గ్రామానికి చెందిన వివాహిత తాడితూరి అనూష (20) అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందింది. ఎస్ఐ యు.మహేష్ కథనం ప్రకారం... బంగారమ్మ పేట గ్రామానికి చెందిన మక్కా జగదీష్‌తో నాలుగు నెలల క్రితం అనూషకు వివాహం జరిగింది. అదే గ్రామానికి చెందిన బోని వెంకట దుర్గాప్రసాద్‌తో గత కొన్నేళ్లుగా ఆమెకు స్నేహం ఉండేది. పెళ్లయిన తర్వాత కూడా ఆమెను వేధిస్తూ వైజాగ్‌లోని గదికి రావాలని బలవంతం చేస్తుండేవాడు. రాకపోతే ఇంతకుముందు కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలు అందరికీ పంపిస్తానని బెదిరించేవాడు. దీంతో ఆదివారం రాత్రి అనూష తన సోదరుడికి, స్నేహితురాలికి ఈ విషయం మెసేజ్ ద్వారా తెలియజేసింది. ఇంటి సమీపంలోని పశువుల శాలలో సోమవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో ఆమె మృతదేహం లభ్యమైంది. తండ్రి తాడుతూరి రమణ ఫిర్యాదు మేరకు డిఎస్‌పి పి.శ్రీనివాసరావు, సిఐ ఎన్.వి.ప్రభాకర్‌రావు, తహశీల్దార్ సిహెచ్‌వి రమేష్ గ్రామానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన అనూష

డాబా పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వంగర

మండలంలోని అరసాడ స్వీట్ షాపులో పనిచేసిన బేర వెంకటరావు ఆదివారం రాత్రి నిద్రమత్తులో డాబాపై నుంచి కిందకు జారిపడి గాయాలు కావడంతో అతన్ని రాజాంలో గల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి శ్రీకాకుళంలో గల రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వెంకటరావు సోమవారం మృతి చెందాడు. అతని భార్య మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వైవి జనార్ధన్ తెలిపారు.


రైలు కింద పడి తెగిన కాళ్లు

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారు జామున ప్రమాదవశాత్తూ గొలజాపు పెంటయ్య రైలు కింద పడటంతో రెండు కాళ్లూ తెగిపోయాయి. బహిర్భూమికి వెళ్లిన పెంటయ్య ప్రమాదం బారిన పడ్డాడు. చాలా సమయం వరకూ అటుగా ఎవరూ రాకపోకపోవడంతో నానా ఇబ్బంది పడ్డాడు. అటుగా వెళ్లిన ఒక మహిళ రైలు పట్టాలపై నరకయాతన అనుభవిస్తున్న ఆయన్ను చూసి కుటుంబీకులకు సమాచారం అందించింది. వారు రైల్వే ఆర్‌పిఎఫ్ ఎస్ఐ ఆర్.హస్తకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. 108 వాహనంలో విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. సుమారు గంట వరకూ 108 సిబ్బంది స్పందించకపోవడం గమనార్హం. 108 వాహనం వచ్చే వరకు పెంటయ్య నరకయాతనతో విలవిల్లాడిపోయాడు. ఆయన పరిస్థితి అక్కడున్న వారిని తీవ్రంగా కలచివేసింది.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-శృంగవరపుకోట



మండలంలోని ఎస్.కోట తలారి గ్రామానికి చెందిన తాటి చెట్ల కోటి బాబు (17) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని ఎస్.కోట తలారి గ్రామానికి చెందిన తాటి చెట్ల వెంకట అప్పారావు కుమారుడు కోటి బాబు సోమవారం ఉదయం పొలంలోకి వెళ్లి పశువులను తోలుకొచ్చి ఇంటికి వచ్చాడు. అనంతరం గదిలోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. తండ్రి వెంకట అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఖాళీ స్థలాలు కొత్త పరిశ్రమలకు కేటాయింపు

- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ఎమ్మెల్యేలతో మర్యాద పూర్వక భేటీ

ప్రజాశక్తి-బొబ్బిలి

పరిశ్రమలకు స్థలాలు కేటాయించినప్పటికీ పనులు ప్రారంభం కాని పరిశ్రమల స్థలాలను రద్దు చేసి నూతన పరిశ్రమలకు కేటాయిస్తామని రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. సోమవారం తొలిసారి బొబ్బిలి వచ్చిన మంత్రి శ్రీనివాస్ కు ఎమ్మెల్యే బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మరిశర్ల రామారావునాయుడు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కూటమి నాయకులు, కార్యకర్తలు మంత్రి శ్రీనివాస్ కు పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం దర్బార్ మహాల్లో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో సమస్యలను తెలుసుకునేందుకు పర్యటిస్తున్నామని చెప్పారు. ప్రజలు, రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రోత్ సెంటర్లో ఇథనాల్ పరిశ్రమకు భూమి కేటాయించినప్పటికి పరిశ్రమ పనులు ప్రారంభించలేదన్నారు. పనులు ప్రారంభం కానీ పరిశ్రమల స్థలాలను రద్దు చేసి నూతన పరిశ్రమలకు కేటాయిస్తామని చెప్పారు. గ్రోత్ సెంటర్‌లో మౌలిక సౌకర్యాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. మూతపడిన చక్కెర పరిశ్రమలను తేరిపించేందు ప్రయత్నం చేస్తామన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి : బేబినాయన


బొబ్బిలి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ను ఎమ్మెల్యే బేబినాయన కోరారు. కోటకు వచ్చిన మంత్రి శ్రీనివాస్ కు నియోజకవర్గ సమస్యలను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రోత్ సెంటర్ కు కారుచౌకగా భూములిచ్చిన 15 గ్రామాల రైతులకు సంపూర్ణంగా ఉద్యోగాలు లేవన్నారు. న్యాయబద్ధంగా రావాల్సిన ఉద్యోగాలు అడిగితే వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టిందన్నారు. గ్రోత్ సెంటర్లో బినామీ పేర్లతో ఉన్న భూములను రద్దు చేసి పరిశ్రమలు ఏర్పాటు చేసే పారిశ్రామిక వేత్తలకు భూములు కేటాయించాలని కోరారు. పారాది వంతెన వద్ద నిర్మించిన రోడ్డు వరదలకు కొట్టుకుపోతోందని, రూ.15లక్షల వరకు కేటాయిస్తే రోడ్డు బాగుచేసి రాకపోకలకు ఆటంకం లేకుండా చేయవచ్చునన్నారు. మూతపడిన చక్కెర పరిశ్రమలను తెరిపించాలని కోరారు.

శివడవలస వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేయాలి

మండలంలోని శివడవలస వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ వెంగళ లక్ష్మి, టిడిపి నాయకులు వెంగళ నారాయణరావు, రైతులు.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే బేబినాయనకు వినతిపత్రం అందజేశారు. టిడిపి హయాంలో శివడవలస వద్ద అప్పటి మంత్రి సుజయకృష్ణ శంకుస్థాపన చేస్తే వైసిపి ప్రభుత్వ హయాంలో శిలాఫలకాన్ని ధ్వంసం చేసి, రాముడువలస వద్ద అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ శంకుస్థాపన చేశారని వివరించారు. శివడవలస పరిసర ప్రాంతాల్లో మెట్టు భూములు కావడంతో పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి



మంత్రి శ్రీనివాస్‌కు వీణను బహూకరిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన, మాజీ ఎమ్మెల్యే రాజా

జనసేన కార్యాలయానికి వెళ్లిన మంత్రి

బొబ్బిలి వచ్చిన మంత్రి శ్రీనివాస్ జనసేన కార్యాలయానికి వెళ్లారు. ఆయనకు జనసేన రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరి, జనసైనికులు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు.

ఎమ్మెల్యేను కలిసిన మంత్రి

భోగాపురం : రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం మాధవిని సోమవారం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గం ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : లక్కవరపుకోటలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని మంత్రి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్లయపై చర్చించారు. జిందాల్ పరిశ్రమను తెరిపించాలని కోరుతూ కార్మికులు మంత్రికి వినతనివ్వగా ఆయన సానుకూలంగా స్పందించారు.



వ్యవసాయశాఖా మంత్రికి పుష్పగుచ్చం అందజేస్తున్న హోంశాఖా మంత్రి అనిత, విజయనగరం ఎమ్మెల్యే, ఎమ్‌పి;



భోగాపురంలో అభినందనలు తెలుపుతున్న టిడిపి నాయకులు

కేంద్ర, రాష్ట్ర మంత్రులకు ఘనస్వాగతం

ప్రజాశక్తి - భోగాపురం

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెంనాయుడుకు మండలంలోని పోలిపల్లి సమీపంలో భూమాత లేఅవుట్‌లో టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజుతో పాటు నాలుగు మండలాల నాయకులు సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భారీ గజమాలను వారిద్దరికి వేశారు. ఆయనను ఇక్కడ నుంచి ర్యాలీ తీసుకువెళ్ళేందుకు శ్రీకాకుళం జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి కార్లలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు వచ్చారు. మంత్రులు భోజనం చేసేందుకు వారికోసం ఏర్పాటు చేసిన గదిలోకి వెళ్ళారు. ఇంతలో శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గది బయట చేరుకొని ఆయనను కలిసేందుకు ప్రయత్నించారు. కానీ పోలీసులు వారిని కంట్రోల్ చేయడం పెద్ద సవాల్‌గా మారింది. దీంతో మంత్రులు ఇద్దరు బయటకు వచ్చి తమకోసం వచ్చిన వారందర్ని కలుసుకున్నారు. వారిద్దర్ని నాయకులు కార్యకర్తలు పూల బొకేలు అందజేసి శాలువలు కప్పి సన్మానించారు. ఈ సమయంలో పెద్ద ఎత్తున తోపులాట జరగడంతో డిఎస్‌పి గోవిందరావు ఆధ్వర్యంలో సిఐలు వెంకటేశ్వరరావు, రవికుమార్ స్పెషల్ రోప్ పార్టీలు రంగంలోకి దిగి నాయకులు, కార్యకర్తలను కంట్రోల్ చేశారు. నాయకులు కర్రోతు బంగార్రాజు, మహంతి చిన్నంనాయుడు, కడగల ఆనంద కుమార్, కంది చంద్రశేఖర్, సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

భారీగా దోచుకున్న జేబు దొంగలు

ఇద్దరు మంత్రులకు గజమాల వేస్తున్న సందర్భంలో నాయకులు, కార్యకర్తల జేబులను దొంగలు భారీగా దోచుకున్నారు. డెంకాడ మండలానికి చెందిన ముఖ్యనాయకుడి జేబులోని ఎటిఎమ్ కార్డులతో సహా రూ.9వేలు, భోగాపురం మండలంలోని ముఖ్యనాయకుడి జేబులో నుంచి రూ.10వేలు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒక నాయకుడి జేబులో నుంచి సుమారు రూ.40వేలు దోచుకున్నారు. వీరివే కాక చాలా మంది నాయకులు, కార్యకర్తల జేబులను దొంగలు ఖాళీ చేసేశారు. ఇలాంటి కార్యక్రమాలకు ఖచ్చితంగా జేబు దొంగలు హాజరవుతారన్న విషయం పోలీసులకు తెలిసినప్పటికి ప్రత్యేక చర్యలు చేపట్టలేదని నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు.

ఎయిర్‌పోర్టులో ఎంపి, ఎమ్మెల్యే స్వాగతం

విజయనగరం కోట : కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు, రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు విశాఖ ఎయిర్‌పోర్టులో విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు ఘన స్వాగతం పలికారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి శ్రీకాళం జిల్లాకు వెళ్తున్న వారికి విమానాశ్రయం వద్ద కలిసి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, పాతపట్నం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవింద రావు ఉన్నారు.

అసంపూర్తిగా నాడు -నేడు పనులు

నూతన ప్రభుత్వంలో సమస్యలు తీరేనా?

ప్రజాశక్తి- మెరక ముడిదాం

పాఠశాలల్లో నాడునేడు పనులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. మండలంలో సుమారు 73 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు తొమ్మిది, ఎంపిపిఎస్ పాఠశాలలు ఏభై రెండు, ఎంపి యుపి పాఠశాలలు తొమ్మిది, మోడల్ పాఠశాల ఒకటి, కెజిబివి ఒకటి, ఎయిడెడ్ ఒకటి ఉన్నాయి. ఈ పాఠశాలలు సమూలాంగా మార్పు తీసుకొచ్చి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నిర్మాణం చేపట్టి, మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా గత ప్రభుత్వం నాడు -నేడు పనులు చేపట్టింది. అయితే చివరి దశకు వచ్చేసరికి మండలంలో సుమారు 21 పాఠశాలల్లో ఈ పనులు వివిధ దశలలో ఆగిపోయాయి.

మండలంలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న నాడు నేడు పనులు నిధులు లేక ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మెరకముడిదాం కెజిబివి, బుధరాయవలస, గర్భాం, గరుగుబిల్లి, ఎస్ కొర్లామ్, ముడిదాం ఎస్‌సి, మర్రివలస, పాండ్రంకి పేట, ఎస్ పూతికావలస, రామాయవలస, సింగవరం, చినబంటుపల్లి, రాచపేట, ఊటపల్లి, ఎన్ బుధరాయవలస ప్రాథమిక పాఠశాలల్లో నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. బైరిపురం, బిల్లలవలస, గరుగుబిల్లి, గోపానవలస, శాతం వలస జెడ్‌హెచ్‌ఎస్ పాఠశాలల్లోనూ నిర్మాణాలు నిలిచిపోయాయి. సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో పాటు ఇసుక, సిమ్మెంట్ కొరత పనులు నిలుపుదలకు కారణంగా తెలిస్తోంది. ఇప్పటికే బిల్లలవలస, బైరిపురం పాఠశాలలో నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని త్వరలో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు, అధికారులు చెబుతున్నారు. అయితే నూతనంగా ఏర్పడిన ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్మాణంలో ఉన్న పాఠశాలల అదనపు భవనాలపై దృష్టి సారించి పూర్తి చేస్తుందా లేదా అని పలువురు చర్చించుకుంటున్నారు. విద్యార్థుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలను పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.



మధ్యలో నిలిచిపోయిన పాఠశాల భవనాలు

సతివాడలో 'నేను బడికి పోతా'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని సతివాడలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని సోమవారం జిల్లా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేక అవసరాల పిల్లలు, బడి ఈడు పిల్లలు ప్రత్యేక నమోదు కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా జిల్లా ఎఎంఒ బి.ప్రసాద్, సిఎంఒ బి. ఆదినారాయణ, ఐఇ కో ఆర్డినేటర్ ఎం.భారతి మాట్లాడుతూ తల్లి దండ్రులు బడి ఈడు పిల్లలు, ప్రత్యేక అవసరాల పిల్లలను ఆయా పాఠశాలల్లో నమోదు చేయాలని కోరారు. సాధారణ పిల్లలను కూడా ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా అందరూ తలిదండ్రులు పిల్లలను నమోదు చేయాల్సిన బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు యు. సూర్య నారాయణ మూర్తి, ఈపు విజయ్ కుమార్, హెచ్‌ఎంలు ఆర్. బంగారు నాయుడు, వి. కృష్ణమూర్తి, వి.శ్యాంసుందర్, ఐఈఆర్‌టి బి. అప్పలనాయుడు, సిఆర్‌పి బి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సమగ్ర శిక్ష సిబ్బంది

'రాజకీయ కక్ష సాధింపు సరికాదు'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాజకీయ కక్ష సాధింపులతో ఇల్లు నిర్మాణాన్ని అడ్డుకోవడం భావ్యం కాదని బాధితుడు పట్నాన రమణ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధి సర్వే నంబర్ 311లో 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ వద్ద రెండు సెంట్లు భూమి తాను కొన్నానని తెలిపారు. అయితే కౌన్సిలర్ మీద రాజకీయ కక్షతో తాను నిర్మిస్తున్న ఇల్లు 5 అడుగులు రోడ్డు మీద ఉందని పోలీసులు, విఆర్‌ఒ వచ్చి నిర్మాణ పనులు అడ్డుకున్నారని తెలిపాడు.

ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రాజకీయ కక్షతో పనుల అడ్డుకోవడం భావ్యం కాదని ఇదే సర్వే నెంబర్ రాస్తాలో ఎంతో మంది ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా ఇళ్లు, భవనాలు నించుకున్నారని అన్నారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ 10వ వార్డు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని టిడిపి మండల అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన నగర పంచాయతీ పదో వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీరు, వీధిలైట్లు, రోడ్లు సమస్యలను గుర్తించి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల నగర పంచాయతీ పట్టణ ప్రెసిడెంట్ లెంక అప్పలనాయుడు, వీరభద్రుడు, కౌన్సిలర్ నరవ రామలక్ష్మి, యూత్ ప్రెసిడెంట్ పిల్లా శ్రీనివాసరావు, మీసాల శ్రీనివాసరావు, గంట లక్ష్మణరావు, పైల సురేష్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రముఖుల పుట్టినరోజు వేడుకలు అనాథాశ్రమాల్లో నిర్వహించడం సాంప్రదాయమని పట్టణంలోని కనపాకకు చెందిన అన్నదాత సుఖీభవ అనాథాశ్రమం నిర్వాహకులు కాంచన పేర్కొన్నారు. రాజమండ్రి దగ్గర వేమగిరికి చెందిన కొప్పు శెట్టి నాగేశ్వరరావు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి శుభాష్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని సోమవారం నగరంలోని రెడ్ క్రాస్ నిరాశ్రయుల షెల్టర్, కణపాక మర్రి చెన్నారెడ్డి కాలనీలోని అన్నదాత సుఖీభవ ఆశ్రమం లో అన్నదానం నిర్వహించారు. ఆశ్రమంలోని పిల్లల మధ్య కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పిల్లలకు బిస్కెట్లు, కేకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ సంస్థ నిర్వాహకులు కాంచన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్

ప్రజాశక్తి- చీపురుపల్లి

స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవులలో త్యాగ నిరతిని వ్యాపింప చేయడమే బక్రీద్ పండగ ముఖ్యోద్దేశం అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రాంమల్లిక్ నాయుడు అన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని సోమవారం మసీదుకు వెళ్లి ముస్లిములకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగగుణాన్ని ప్రబోధించే బక్రీద్ పండుగని స్ఫూర్తిగా తీసుకుని సమైక్యతను, సమానత్వాన్ని సాధిద్దాం అని పిలుపునిచ్చారు. అందరూ సోదర భావంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రౌతు కామునాయుడు, జనసేన అధ్యక్షుడు విసినిగిరి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణంలో బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. మసీదులో ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిములకు ఎమ్మెల్యే బేబినాయన బక్రీద్ శుభాకాంక్షలు చెప్పారు.

కొత్తవలస : మండలంలో బక్రీద్ పండగను ముస్లిములు సోమవారం ఘనంగా నిర్వహించారు. కొత్తవలస, డాబాలు, సంతపాలెం, దెందేరు, చింతలదిమ్మ, దేవాడ, ఉత్తరాపల్లి మసీదుల వద్ద ప్రార్థనలు చేశారు. నిరుపేదలకు దాన ధర్మాలు చేశారు.